క్లుప్తంగా

వేగంగా భూముల రీ సర్వే

కారెంపూడి: మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను మండల సర్వేయర్ సులేమాన్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. స్థానిక దాచేపల్లి వెళ్లే రోడ్డు పక్క పొలాలను ఒక సర్వే బృందం, పెదకొదమగుండ్ల బ్రాంచి కాల్వ పరిధిలోని మొరస పొలాలను మరో బృందం రీ సర్వే చేస్తోంది. ఈ పనులను మండల సర్వేయర్ పరిశీలించారు. రీసర్వే వేగంగా జరుగుతున్నట్టు వివరించారు. రైతులు సర్వేకు సహకరించాలన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



దాచేపల్లి : విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఎంఈఓ బి.రాజకుమారి చెప్పారు. పొందుగలలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆహపదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసనాయక్, సుధాకర్‌రెడ్డి, సరస్వతిదేవి, పిచ్చయ్య, కృష్ణవేణి, ఫర్వీన్, సీఆర్పీ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

పిడుగురాళ్ల: విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని పట్టణంలోని ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం పి.స్వామి తెలిపారు. పట్టణంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ముందుగా బాలల దినోత్సవం సందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్లో జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బాలల దినోత్సవం సందర్భంగా రెంటాల జెడ్పీ పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి

కారెంపూడి/రెంటచింతల/దాచేపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఆటల పోటీలలో విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఒప్పిచర్లలో జరిగిన బాలల దినోత్సవంలో గ్రామ సర్పంచ్ ఇరికెదిండ్ల రమణకొండలు, మాజీ ఎంపీపీ పంగులూరి చినవెంకటనర్సయ్య పాల్గొన్నారు. అలాగే మిరియాల, పెదకొదమగుండ్ల, చినగార్లపాడు, కారెంపూడి జెడ్పీ హైస్కూళ్లతోపాటు గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం, ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలలో బాలల దినోత్సవం వైభవంగా జరిగింది.

● రెంటచింతల మండలం పాలువాయి, రెంటాల గ్రామాలలోని జెడ్పీ పాఠశాలల్లో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా 30 మంది విద్యార్థులకు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, పాలువాయి సర్పంచ్ మందలపు విజయలక్ష్మితో కలసి స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. నెహ్రూ గురించి బాలలకు వివరించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి వివిధ పాఠశాలల్లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమాల్లో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు.

● దాచేపల్లి మండలం కేసానుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌తోపాటు పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం జరిగింది. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు చెట్టిపోగు ఏసురత్నం పాల్గొన్నారు.

సీఎం జగన్ సభను జయప్రదం చేద్దాం

జెడ్పీ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి

రెంటచింతల: పల్నాడు ప్రజల చిరకాల స్వప్నమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని సాకారం చేసేందుకు బుధవారం మాచర్ల వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుదామని, ఎత్తిపోతల ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమాన్ని, బహిరంగ సభను జయప్రదం చేద్దామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంటిరెడ్డి నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ప్రభుత్వ విప్, వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), పార్టీ పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిల నేతృత్వంలో తలపెట్టిన వరికపుడిశెల ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, నేతలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

అన్ని ఏర్పాట్లూ పూర్తి

కారెంపూడి: వరికెపూడిశెల లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి శంకుస్థాపన చేసి పల్నాడు ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చేందుకు బుధవారం మాచర్ల విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని, సుమారు 15 వేల మంది మండలం నుంచి తరలివెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ మంగళవారం తెలిపారు. ప్రజల సౌకర్యార్థం సుమారు 200 బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు వేలాదిగా తరలిరావడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు అన్ని గ్రామాల నుంచి బస్సులు బయలుదేరి 8.30 గంటలకు మాచర్ల చేరుకోవాలని, అందుకు తగినట్లుగా స్థానిక నాయకులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

కార్యకర్తలు తరలివరావాలి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం పలికేందుకు మాచర్ల నియోజక వర్గంలోని అన్నీ గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ చింతా శివరామయ్యలు కోరారు. వారు మాట్లాడుతూ మాచర్ల పట్టణంలోని గుంటూరు రోడ్డులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి వాహనాల ద్వారా వచ్చేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



దుర్గిలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించిన ప్రజా ప్రతినిధులు

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గ్రంథాలయాధికారి పులిబండ్ల వేణుగోపి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యలమంద మాట్లాడుతూ పుస్తక పఠనం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవాన్ని నిర్వహించి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంఈఓ శెట్టిపల్లి గోపాల్, కోట వీరయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం పెద్దబ్బాయి, ఎకటీల బుచ్చిబాబు, తోటకూర వెంకటేశ్వర్లు, తోట మూర్తి, చెన్నుపాటి సీతారామయ్య, చింతా రామకృష్ణ, టీ లక్ష్మినారాయణ, షేక్ అబ్బాస్ మాస్టర్ పలువురు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డుల మంజూరు అభినందనీయం



ప్రభుత్వం మంజూరు చేసిన హెల్త్ కార్డులు చూపిస్తున్న ఉపాధ్యాయులు

దాచేపల్లి : ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయటం అభినందనీయమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టెపు నాగేశ్వరరావు చెప్పారు. ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సమావేశం అయ్యారు. ప్రభుత్వం హెల్త్‌కార్డులు మంజూరు చేయటం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. హెల్త్‌కార్డుల మంజూరు కోసం ప్రభుత్వంతో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చర్చలు జరిపారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో హెల్త్‌కార్డులు మంజూరు చేశారని నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ మస్తాన్‌వలి, తగరం ఆనంద్‌కుమార్, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

చెంచు, గిరిజనుల జీవనశైలిపై అధ్యయనం భేష్



వెల్దుర్తి: చెంచు, గిరిజనుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు కేరళ రాష్ట్రానికి చెందిన మాతా అమృతానందమయి, ఏసీసీఆర్‌సీసీ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులను ఎంపీడీఓ డి.ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా అమృతానందమయి విశ్వవిద్యాలయ విద్యార్థులు నిశాంత్, డాక్టర్ యమున ఆధ్వర్యంలో 21 మంది విద్యార్థులు చెంచు, గిరిజనుల జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు గుడిపాడు చెరువు గ్రామానికి వచ్చారని, వీరు 15 రోజుల పాటు గ్రామంలో ఉండి స్థానిక పరిస్థితులను పరిశీలిస్తారని వివరించారు. చెంచుల సమస్యల పరిష్కారానికి సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. తొలిరోజు గ్రామంలోని మహిళలు, పిల్లలు తీసుకుంటున్న పోషకాహారంపై కేరళ విద్యార్థులు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యంపైనా జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్, మాతా అమృతానందమయి ఫీల్డ్ అసోసియేషన్ మల్లికార్జున, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

డీఏఓ శివనాగిరెడ్డి

గురజాల : ఓటర్ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీ నాయకులు వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రెవెన్యూ డివిజన్ కార్యాలయం పరిపాలనాధికారి శనగల శివనాగిరెడ్డి చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో గురజాల నియోజకవర్గ పరిధిలోని పలు రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మీసాల దానియేలు పాల్గొన్నారు.

చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలి



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ ప్రభావతి, సీసీఎఫ్ జాన్‌బీ

పిడుగురాళ్ల: చిన్నారులు పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ప్రభుత్వ వైద్యాధికారిణి డాక్టర్ ప్రభావతి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణ, మండలంలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించారు. జానపాడు గ్రామానికి చెందిన ఎ.రామకృష్ణ ఈ పౌష్టికాహారాన్ని అందజేశారు. వైఆర్‌జీ కేర్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ చిన్నారులలో వ్యాధి నిరోధక శక్తి పెరగాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అలా తీసుకునే విధంగా ఎన్‌జీవో సంస్థలు ముందుకు వచ్చి ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. చిల్డ్రన్ కేర్ ఫెసిలిటెటర్ (సీసీఎఫ్) జాన్‌బీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, వైఆర్‌జీకేర్ ఎన్‌జీవో సంస్థల ఆధ్వర్యంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 15 ఏళ్లలోపు వయస్సు ఉన్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి పౌష్టికాహారం అందిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం సుమారు 20 మంది చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఆర్‌సీకేర్ కౌన్సిలర్ వెనీలా, ఎ.రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'



పిడుగురాళ్ల పట్టణంలోని మూడో సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న నాయకులు

పిడుగురాళ్ల: పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా సచివాలయ సమీపంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలతో రూపొందించిన బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బడిగుంతల నాగమణి వెంకటేశ్వర్లు, జూలకంటి శ్రీనివాసరావు, జానిబాషా, వీరయ్య, మహ్మద్ ఆలీ, సచివాలయ సిబ్బంది, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఎంపీపీ కటకం జయశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ

దాచేపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ కటకం జయశ్రీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ జయశ్రీ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పలు అంశాలపై సమావేశంలో చర్చించి సభ్యుల ఆమోదం పొందారు. వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీపీ జయశ్రీ చెప్పారు. మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి బ్లీచింగ్ చల్లించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గటం వలన కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లుగా సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని, తాగునీరు పుష్కలంగా అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులు సకాలంలో ఖర్చు చేయాలని ఎంపీపీ జయశ్రీ పేర్కొన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి ప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, తహశీల్దార్ జి.కరుణ కుమార్, ఎంపీడీఓ శోభారాణి, ఈవోపీఆర్డీ జోషుబాబు తదితరులు పాల్గొన్నారు.

500 మంది భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి

సత్రశాల(రెంటచింతల): అన్నం పరబ్రహ్మ స్వరూపమని, భక్తులకు అన్నదానం చేస్తే భగవంతునికి చేసినట్లేనని దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి గురుస్వామి చెప్పారు. మంగళవారం కార్తిక మాసం ప్రారంభం సందర్భంగా మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో స్వామిని దర్శించుకున్న వివిధ స్వామి మాలధారులకు, 500 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భ్రమరాంబికాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల శివ శర్మ నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలతోపాటు పలు రకాల అభిషేకాలు, కుంకుమార్చన, గణపతి, రుద్రహోమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పరాశక్తి శ్రీనివాసరావు, మహేశ్వరి దంపతులు ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు బ్రహ్మారెడ్డి వెల్లడించారు. మంచికల్లు గ్రామానికి చెందిన యెనిగండ్ల మట్టయ్య నేతృత్వంలో శ్రీ చౌడేశ్వరి సంఘం మహిళలు దేవస్థానం ఆవరణలో కోలాటం ప్రదర్శించారు. మాజీ వైస్ చైర్మన్ బాపనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.